అమెరికా తెలుగు సంఘం, అమృత్ కిరణ్ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# స్నేహ హస్తం

ఇల్లంతా హడావిడిగా ఉంది. మంచం మీద ఒక పక్క ఇస్త్రీ బట్టలూ, ఒక పక్క ఇస్త్రీ చేయవలసిన బట్టలూ, మరొక పక్క ఇస్త్రీ అక్కరలేని బట్టలూ, టేబులు మీద ప్రయాణానికి కావలసిన పౌడరు, అద్దం, దువ్వెన, రిబ్బన్లు వగైరా...



హడావిడిగా పెట్టుకొన్న ప్రయాణం, నిన్న రాత్రే అనుకున్నారు. అనుకోకుండా సెలవు కలిసి రావడంతో అమరావతి ప్రయాణం పెట్టుకున్నారు. పొద్దున్నే ఎనిమిది కి ముందు బయలుదేరే బస్సులో బయలుదేరితే తొమ్మిదిన్నర లోపు చేరుకోవచ్చు. కృష్ణలో స్నానం, గుడికి వెళ్ళటం, తెచ్చుకున్న టిఫిన్లు తినటం, మ్యూజియం లాంటివి చూడటం, సాయంత్రానికి పక్కవూరిలో మావయ్య ఇంటికి వెళ్ళి మర్నాడు రావడం.

శకుంతల రాత్రి పడుకునేటప్పటికి పన్నెండు అయింది. నిద్ర ముంచుకు వస్తున్నా కొన్ని ముఖ్యమైన బట్టలు ఉతికింది. అవి రాత్రికి ఆరితే పొద్దున్నకి ఇస్త్రీ చేయాలి. వాటిని కుర్చీలకీ మేకులకీ ఆరవేసి,ఫాన్ వేసిపెట్టింది. రాత్రి సూటుకేసు ఖాళీ చేసి దులిపి శుభ్రం చేసింది. తెల్లవారు గట్ల మూడింటికి లేచింది.

లేస్తూనే మొహం కడుక్కుని స్టవ్ మీద కుక్కర్ లో బియ్యం కడిగిపెట్టింది. పులిహోర,చక్కెరపొంగలి అయేటప్పటికి నాలుగు అయ్యింది. కళ్ళు నిద్రతో కూరుకు పోతూన్నాయి. అప్పుడే ఇస్త్రీ పెట్టె ప్లగ్ పెట్టి వేడెక్కగానే అన్ని బట్టలూ ఇస్త్రీ చేసింది.

పిల్లల్ని లేపితే ఒక పట్టాన లేవలేదు. భర్త చక్రపాణిని లేపితే కసిరాడు.

ఆలస్యం కాకూడదని బ్రతిమాలి, భంగపడి పిల్లల్ని బలవంతాన లేపి మొహాలు కడిగించి డికాక్షన్ పెట్టింది. పాలు తొందరగా కావాలని కబురుపెట్టింది.

పిల్లలకి వేడి నీళ్ళు పెట్టి స్నానం చేయించింది. వంటకాలు కారియర్లలో సర్దింది. తను జడవేసుకొని స్నానం చేసింది. పాపకి జడవేసింది.

చేతికి అందీ, గుర్తుకు వచ్చిన పనల్లా చేస్తోంది. నీరసంగా ఉన్నాకూడా.

వీళ్ళతో పాటు ప్రయాణం పెట్టుకున్న పక్కింటి సుబ్బారావు గారు వచ్చారు.

ఆయన్ని చూడగానే నిద్రలేచాడు చక్రపాణి.

లేస్తూనే సిగరెట్ ముట్టించాడు.

మాటల ప్రవాహం మొదలైంది.

'గీతకి గౌను మార్చు. బాగాలేదు. బాబుకి నిక్కరు, షర్టు మేచింగ్ లేవు. నాకు లైట్ షర్టువద్దు. బస్సులో మాసిపోతుంది. అలా అని చెక్స్ షర్టు పెట్టకు. ఫ్లాస్కులో కాఫీ బాగా వేడిగా పొయ్యి. స్ట్రాంగ్‌గా ఉండాలి . నాకూ సుబ్బారావు గారికీ రెండుసార్లకి రావాలి.

నాకు వేడి నీళ్ళు పెట్టు. గళ్ళ తువ్వాలు సబ్బు పెరట్లో పెట్టు. అక్కడ స్నానం చేస్తాను. అయిదు నిమిషాలు టైము "

పక్కింటి సుబ్బారావు గారి వైపు తిరిగి తీరిగ్గా పొగపీల్చడం మొదలుపెట్టాడు.

'ఆడవాళ్ళు -ఆలస్యం ' మీద వరుసగా జోకులు పేల్చాడు. అతని జోకులకి అతనికే బాగా నవ్వు వచ్చింది. సుబ్బారావు గారితో 'అసలొకటి గుర్తుంచుకోండి. మగవాడన్నవాడెవడైనా గుర్తుంచుకోవాలి. బస్సు ఎనిమిదింటికయితే ఆడవాళ్ళకి ఆరు ముప్పావు కి అని చెప్పాలి. అప్పుడు ఎనిమిదిన్నరకి తయారవుతారు' అంటూ నవ్వి 'ఇదికో ఇంకో రెండు కాఫీ పట్రా... సుబ్బారావుగారికి కూడా ... అలా కుర్చీలో కూర్చున్నావేం? 'అన్నాడు.

ఆమె కుర్చీల్లో, కూర్చోలేదు -కూలబడిపోయింది !

ఈ మాటలు ఆమెని నీరసంలోనుంచి నిస్త్రాణలోకి తీసుకుపోయాయి. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్ళు,చేతులు వణుకుతున్నాయి. మాటలు సరిగ్గా వినపడటంలేదు.

మనసులో కదలాడుతూ పైకి అనలేని మాటలు ఆమెకి తెలియకుండానే అస్పష్టంగా పైకి వచ్చేస్తున్నాయి.

"నేను కోరుకునేది బద్ధకంగా సిగరెట్లు కాలుస్తూ, ఆర్డర్లు జారీ చేస్తూ , ఆడవాళ్ళూ -ఆలస్యం ' మీద జోకులేస్తూ నవ్వుకునే మనిషిని కాదు.

స్నేహహస్తం అందించే మనిషిని.

ఏభార్యకైనా కావలసింది అలాంటి భర్తే"

కాశీనాథ & కాశీనాథ

లెక్చరర్, ఎమ్. హెచ్. నెం. 40

హౌసింగ్ బోర్డ్ కాలనీ,

ఒంగోలు - 523 002.